ప్రగతి పథంలో రాష్ట్ర పాలన

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి

కేవీపల్లె : రాష్ట్ర ప్రభుత్వ పాలన ప్రగతి పథంలో దూసుకుపోతోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవపల్లె, మొరవపల్లె కాలనీ, మొరవ వడ్డిపల్లె, యల్లంపల్లె, దళితవాడ, ఏటిగడ్డ దళితవాడ, తిరుపతిరోడ్డులో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో అందిన లబ్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూగ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థతో తమ ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోరే మన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

ఒకే కుటుంబానికి రూ. 22 లక్షల లబ్ధి... మొరవపల్లె కాలనీకి చెందిన రామాంజులమ్మ, రామకృష్ణ నాయక్ కుటుంబానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరినట్లు ఎమ్మెల్యే వివరించారు. సర్పంచ్‌లు బి.సి. జయలక్ష్మీదేవి, దండు జగన్ మోహన్‌రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రవీంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ చలపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా


లబ్ధిదారులు పొందిన సాయాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం సాయంత్రం వెంగమ్‌వారిపల్లెల్లో గొల్లపల్లి, బాలినాయనపల్లె గ్రామాల్లో సర్పంచు శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు నవీన్ ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆర్‌ఐ రమణారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, పొందిన సాయాన్ని లబ్ధిదారులకు వివరించారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ శేషగిరిరావు, తాహశీల్దార్ మంజుల, సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్‌రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులుశెట్టి, శివశంకర్‌రెడ్డి, ఎర్రమల్లయ్య, కదిరప్ప, వెంకటరమణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా.. నేతన్నకు పండుగ

- నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు నగదు జమ
- చేనేతల్లో హర్షం

మదనపల్లె సిటీ: వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి ఇంటి ముంగిట సంక్షేమం వాలిపోయింది. కులమతాలకతీతంగా.. పార్టీల రహితంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరింది. ఇక గత ప్రభుత్వాల హయాంలో కునారిల్లిన చేనేతలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. నేతన్న నేస్తం పేరిట అర్హులందరికీ నగదు జమ చేసి అభివృద్ధికి దారి చూపింది.

నాడు టీడీపీ ప్రభుత్వంలో:
చేనేత రంగ సంక్షేమాన్ని గత టీడీపీ ప్రభుత్వం విస్మరించింది. పెరిగిన ముడిపట్టు ధరలతో కార్మికులు అల్లాడిపోతుంటే ముడిపట్టు రాయితీ నెలకు రూ.600 ఇవ్వడానికి కూడా అప్పటి సీఎం చంద్రబాబుకు చేతులు రాలేదు. ఎప్పుడో 6 నెలలకో, పది నెలలకో ఒకసారి రాయితీ సొమ్ము అరకొర ఇచ్చి చేతులు దులుపుకునేవారు. అది కూడా సెరికల్చర్ కార్యాలయాల చుట్టూ వారాల తరబడి తిరిగితేనే పనయ్యేది. సాంకేతిక సమస్యతో ఎవరికైనా డబ్బు అందకపోతే దాని గురించి మరచిపోవాల్సిందే.

నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..
చేనేతలకు అండగా నిలుస్తామని ఎన్నికల ముందు చెప్పిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హులైన నేతన్నలకు ఖాతాలో రూ.24 వేలు జమ చేస్తున్నారు. ఇందుకు ఎవరి సిఫారసు అవసరం లేదు. ఏ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేదు. అన్ని పరిశీలించి అర్హులకు పథకం అందేలా చూస్తున్నారు.

నేతన్న నేస్తం లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు	మొత్తం సొమ్ము
2022లో		
మదనపల్లె మున్సిపాలిటీ	2567	రూ. 6,16,08,000
మదనపల్లె రూరల్	1056	రూ. 2,53,44,000
నిమ్మనపల్లె	120	రూ. 28,80,000
రామసముద్రం	8	రూ. 1,92,000
2023లో		
మదనపల్లె మున్సిపాలిటీ	2904	రూ.6,96,96,000
మదనపల్లె రూరల్	1207	రూ.2,89,68,000
నిమ్మనపల్లె	133	రూ.31,92,000
రామసముద్రం	8	రూ. 1,92,000



క్రమం తప్పకుండా ..



నా పేరు బి.సుజాత. మదనపల్లె పట్టణం వెంకటేశ్వరపురంలో చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నాం. నేతన్న నేస్తం 2019 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు వచ్చింది.క్రమం తప్పకుండా వస్తుండటంతో ఎంతో ఆదరువుగా ఉంది. సీఎం చేసిన మేలు మరవలేము.

ఉపాధి మెరుగు



నా పేరు వేణుగోపాల్. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నా. నేతన్న నేస్తం ద్వారా మగ్గాల పరికరాలు అమర్చుకున్నాం. వరుసగా పథకం కింద డబ్బులు వస్తుండటంతో సంతోషంగా ఉంది.చేనేతలకు సీఎం అండగా నిలుస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ మహిళలకు వరం


కేవీపల్లె: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరమ్మ

కేవీపల్లె : బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఓ వరం లాంటిదని ఎంపీపీ ఈశ్వరమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో ఇంటి వద్దకే సంపూర్ణ పోషణ వస్తువుల పంపిణీ, గర్భిణులకు సీమంతం, అన్నప్రాసన, తల్లిపాల ప్రాముఖ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇంటి వద్దకే వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ, ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సైఫుల్లాఖాన్, వైస్ ఎంపీపీ హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, భారతి, శంకరమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ సద్వినియోగం చేసుకోవాలి

నిమ్మనపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు,బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేషగిరిరావు, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భాను, లక్ష్మీదేవి, సిహెచ్‌ఓ మల్లిక తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

కలికిరి: మండలంలోని గుండ్లూరు గ్రామం అద్దవారిపల్లి గ్రామ పంచాయతీ యర్రదొడ్డిపల్లి, పల్లవోలు గ్రామం గడిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గురువారం మహిళలకు అందచేశారు మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, సర్పంచ్ ఆయేషా, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ఇస్తియా క్ అహ్మద్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్షయను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభం


సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారిణి శైలజ

వాల్మీకిపురం: క్షయవ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే దాని నివారణ మార్గం సులభమని అన్నమయ్య జిల్లా అదనపు వైద్యాధికారిణి శైలజ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ పోషణ మిత్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీ, టీబీ రోగులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ, టీబీ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరా తీసి, సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరిటెండెంట్ ఫైరోజా బేగం మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. టీబీ రోగుల సంక్షేమం కోసం కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ రమేష్‌బాబు, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూలోనూ ఉన్నత అవకాశాలు

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్


కలిచెర్లలో మాట్లాడుతున్న అబ్దుల్ కలీమ్

పెద్దమండ్యం: ఉర్దూ మీడియంలోనూ ఉన్నత అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. గురువారం కలిచెర్ల జడ్పీ హైస్కూల్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతృభాష అయిన ఉర్దూను తల్లితో సమానంగా భావించి మక్కువ పెంచుకోవాలన్నారు. ఉర్దూ మీడియంలో చదివిన పలువురు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ఉద్యోగాలు పొందారన్నారు. పోటీప్రపంచంలో విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు.

కలిచెర్లలో ఉర్దూ కంప్యూటర శిక్షణ కేంద్రం

కలిచెర్లలో ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అబ్దుల్ కలీమ్ తెలిపారు. గ్రామంలో ఉర్దూ బాషను అభ్యసించే విద్యార్థులు అధికంగా ఉండడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉర్దూ కంప్యూటర్ కోర్సులలో శిక్షణా తరగతులను ప్రారంభిస్తునట్లు తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ కరీముల్లా, హెచ్‌ఎం రాషిదా బేగం, డాక్టర్ ఖదీరుల్లా, కరీముల్లా, ముబారక్, ఫయాజ్, అహ్మద్, చిన్నోడ నాయక్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల మౌలక పహాడ్ వద్ద గురువారం నిర్వహించిన ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఎమ్మెల్సీ జకియాఖానం, మౌలక పహాడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఖాజా సయ్యద్‌షా అరీఫుల్లా హుసేనీ ప్రారంభించారు. శిబిరంలో తొమ్మిది విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు చికిత్సలు చేశారు. ఈసీజీ, ఎక్స్‌రే వంటి అధునాతన సౌకర్యాలను శిబిరంలో రోగుల కోసం అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, తహశీల్దార్ రాము, ఎండీసీ అధ్యక్షుడు రమేష్, సర్పంచ్‌లు పద్మావతమ్మ, విశ్వనాథ, భాషా, విశ్వనాథరెడ్డి, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ కరీముల్లా, వైస్ ఛైర్మన్ రషీదా, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం స్థలాలపై సర్వే చేయండి


గుర్రంకొండ సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగరాజు

గుర్రంకొండ: గ్రామపంచాయతీల్లో గ్రామకంఠం భూములు, స్థలాలపై సర్వే చేయాలని డీల్‌పీఓ నాగరాజు అన్నారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామిత్వ, జీఎస్‌ఎస్ సర్వేలు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సర్వేలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలోని గ్రామకంఠం భూములు, స్థలాల వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. గ్రామకంఠం భూములు, స్థలాలు పూర్తి సరిహద్దులు, ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వాటి వివరాలు ప్రస్తుతం వాటి పరిస్థితిపై పూర్తి స్థాయిలో నివేదిక అందజేయాలన్నారు. గ్రామపంచాయతీల్లో ఇకమీదట లావాదేవీలన్ని డిజిటల్ పేమెంట్ ద్వారా జరగాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేశులు, ఎవో నాగశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల మార్పులు, చేర్పులు


మాట్లాడుతున్న ఈఆర్‌వో గోపాలకృష్ణ

పీలేరు : ఓటర్ల మార్పులు, చేర్పులు పారదర్శకంగా చేపట్టాలని ఈఆర్‌ఓ గోపాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి ప్రభుత్వం పటిష్టంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చేర్పులు, మార్పులు, తొలగింపులు, చిరునామాలు మార్పులు పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ బూతు వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏవైనా అభ్యంతరాలుంటే రాజకీయ నాయకులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తహశీల్దార్లు ధనుంజయలు, నరసింహులు, ఖాజాబీ, భాగ్యలత, ప్రదీప్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారక

తంబళ్లపల్లె: రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గురువారం పరసతోపు పంచాయతీలోని దబ్బలగుట్టపల్లె, నాయనబ్బిగారిపల్లె, చిన్నప్పగారిపల్లె, ఏటిగడ్డపల్లెల్లో సర్పంచు పార్వతమ్మ, శ్రీనివాసుల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహకారంతో సుమారు రూ.10వేల కోట్లతోఅభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, మల్లయ్యకొండ ఛైర్మన్ మల్లిరెడ్డి, మండల కన్వీనర్ చౌడేశ్వర్, ఆర్‌బికె ఛైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి,పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెద్దమండ్యం: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి అన్నారు. కలిచెర్లలో గురువారం ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా నియోజకవర్గంలోని ఆరు మండలాలలో 79 గ్రామ సచివాలయాల పరిధిలో 23481 మంది విద్యార్థులకు, మహిళలకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశామని వెల్లడించారు. రాబోయే ఎన్నికలలో అన్ని చోట్ల గెలిచి తీరుతామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ పూర్ణచంద్రిక, ఎండిసి అధ్యక్షుడు రమేష్, మల్లయ్యకొండ ఛైర్మన్ మలిరెడ్డి, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ కరీముల్లా, సర్పంచ్‌లు బాషా, విశ్వనాథ, కంటి విశ్వనాధరెడ్డి, పద్మావతమ్మ పాల్గొన్నారు.

కొండంత అభిమానం...



కేవీపల్లె : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తన గుండెల్లో దాచుకున్న కొండంత అభిమానాన్ని నూతనంగా నిర్మిస్తున్న ఇంటి గోడపై ఆయన చిత్రాన్ని వేపించి ప్రత్యేకతను చాటుకున్నారు కేవీపల్లె జెడ్పీటీసీ గజ్జెల శృతి. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి , గజ్జెల శృతి ఆదినుంచి పెద్దిరెడ్డి కుటుంబానికి వీరాభిమానులు. మండలంలోని గర్నిమిట్టలో వారు నూతనంగా నిర్మిస్తున్న తన ఇంటికి ఒకవైపు గోడ మొత్తం మంత్రి పెద్దిరెడ్డి చిత్రాన్ని శాశ్వితంగా ఉండేటట్లు పెయింటింగ్ వేపించి అభిమానాన్ని చాటుకున్నారు. ఆ చిత్రం చూపరులను ఆకట్టుకుంటోంది.

క్లుప్తంగా

బైక్ ర్యాలీకి అనుమతి లేదు

ములకలచెరువు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ములకలచెరువు మీదుగా మదనపల్లె మండలం చిప్పిలికి వెళ్లనున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె డీఎస్పీ కేశప్ప, సీఐ షాదీక్ అలీ గురువారం అన్నమయ్య జిల్లా సరిహద్దులో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మాజీ సీఎం పర్యటనలో భాగంగా జిల్లా సరిహద్దు కావడంతో స్వాగతం పలికేందుకు మాత్రం అనుమతి ఉందన్నారు. మార్గ మధ్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడం, అత్యుత్సాహం ప్రదర్శించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని చెప్పారు.

9న ఆడికృత్తిక మహోత్సవం

మదనపల్లె సిటీ: ఆడికృత్తిక మహోత్సవం పురస్కరించుకుని ఈనెల 9న స్థానిక బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవల్లిదేవసేనా సమేత సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, అర్చకులు మురళి తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకోవాలని కోరారు.

చేపల పెంపకానికి వేలం

పెద్దతిప్పసముద్రం: రంగసముద్రం చెరువులో చేపల పెంపకం కోసం గురువారం రాపూరివాండ్లపల్లి సచివాలయం ఎదుట వేలం పాటలు నిర్వహించారు. స్థానిక వైస్ ఎంపీపీ పప్పు క్రిష్ణవేణమ్మ, సర్పంచ్ శ్రీదేవి, గ్రామస్తుల సమక్షంలో ఈవోఆర్డీ మనోహర్, కార్యదర్శి సురేఖ వేలం పాట నిర్వహించారు. ఫసలీకి రూ.15.10 లక్షలకు హెచ్చు పాటదారుడు వేలం పాటను దక్కించుకున్నాడని అధికారులు పేర్కొన్నారు.

అధ్యాపకుల నియామకం

మదనపల్లె : డిగ్రీ కళాశాల లెక్చరర్ల బదిలీల్లో భాగంగా బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాష్ట్రప్రభుత్వం అధ్యాపకులను నియమించిందని ప్రిన్సిపాల్ డాక్టర్.జి.ఆర్.ఆనంద్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... లెక్చరర్ల బదిలీల్లో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు డాక్టర్.శ్రీదేవి(ఇంగ్లీష్), డాక్టర్.జి.చిన్నరెడ్డి (కెమిస్ట్రీ), డాక్టర్.జి.శ్రీనివాసులు(తెలుగు), డాక్టర్.సీఎస్.శైలజ(బోటని), సూపరింటెండెంట్ వి.ఎం.శ్రీధర్ విధుల్లో చేరారన్నారు. బీటీ కళాశాలకు పూర్వవైభవం దిశగా కృషిచేస్తున్న తరుణంలో విద్యార్థులు, పట్టణ ప్రజలు సహకరించాలని మనవి చేశారు. కళాశాలలో విద్యార్థులను చేర్పించి, అభివృద్ధికి తోడ్పాటునందించాల్సిందిగా కోరారు.

పాలిచ్చే తీరుపై తల్లులకు అవగాహన ముఖ్యం

తంబళ్లపల్లె: చంటిబిడ్డలకు పాలు ఇచ్చే తీరుపై తల్లులకు అవగాహన ముఖ్యమని డాక్టర్లు వాసవి లావణ్య తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక వైద్య విధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లులకు మెడికల్ నాలెడ్జ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందికి కంగారు మదర్‌కేర్‌లో భాగంగా మెడికల్ నాలెడ్జ్ కలిగించేందుకు టూల్స్ ద్వారా ప్రయోగాత్మకంగా డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల సహకారంతో గ్రామీణ ప్రాంతాలలోని తల్లులను చైతన్య పరచాలని సూచించారు. డాక్టర్లు విక్రాంత్ రెడ్డి, రిచర్డ్స్, రూప, షబానా ఫాతిమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పరవాండ్లపల్లిలో తాగునీటి సమస్య

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతిలోని ఉప్పరవాండ్లపల్లిలో 20 రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. ఎగవనున్న నివాస గృహాల ప్రజలకు తాగునీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యపై పంచాయతి కార్యదర్శి సురేఖను వివరణ కోరగా ప్రభుత్వ బోరు నీట మునగడంతో ప్రత్యామ్నాయంగా ప్రైవేటు బోరు నుంచి తాగునీరు అందిస్తున్నామన్నారు. అయితే గ్రామంలో గేట్‌వాల్ ఆన్, ఆఫ్ చేసే వాటర్‌మెన్‌కు ప్రజలు డబ్బులు ఇవ్వలేదనే కారణంగా నీటి సమస్య వచ్చిందని కార్యదర్శి సమాధానం ఇవ్వడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థిక అంశాల నిర్వహణ భేష్


ఆడిట్ నిర్వహిస్తున్న శివకుమార్ బృందం

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీలో ఆర్థిక అంశాల నిర్వహణ, రికార్డులు పక్కాగా ఉన్నాయని ఆడిట్ బృందం ప్రశంసించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏఏఓ శివకుమార్ ఆధ్వర్యంలో ఆడిట్ బృందం ఆదాయ, వ్యయాలపై ఆడిట్ నిర్వహించింది. మేనేజర్ బి.రమాదేవి సంబంధిత రికార్డులు, బిల్లులను అప్పగించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది నగర పంచాయతీకి రూ.2,84,61,759 ఆదాయం లభించగా, రూ.2,80,44,332 ఖర్చులు చేశారు. ఇందులో రూ.74 లక్షలు అభివృద్ధి పనుల కోసం వ్యయం చేయగా, రూ.92 లక్షలు విద్యుత్‌బిల్లు లకు, రూ.86 లక్షల ఉద్యోగులు, సిబ్బంది వేతనాలకు చెల్లించారు. ఆడిట్‌లో ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో క్లీన్‌చిట్ ఇచ్చారు.

జగనన్న కాలనీకి దారి కల్పించండి

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని మదనపల్లి రోడ్డు సీఎల్‌ఆర్‌సీ సమీపంలో గల జగనన్న కాలనీకి దారి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు గురువారం ఉదయం మదనపల్లి–తిరుపతి జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ దారి ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం, కాలనీకి పూర్తిగా దారి లేకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోవడంతో నిరసనకు దిగామన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులకు సర్దిచెప్పి రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయానికి చేరుకున్న కాలనీ వాసులు అక్కడ తహశీల్దారు అందుబాటులో లేక పోవడంతో వెనుదిరిగారు.

మైకావీధి వాసుల నిరసన

మదనపల్లె : పట్టణంలోని గాంధీరోడ్డు నుంచి మైకా వీధిలోకి రోడ్డును ఆక్రమణదారుల చెర నుంచి విడిపించి, స్థానికులకు దారి సౌకర్యం కల్పించాలని కోరారు. గురువారం మైకావీధిలో దారి స్థలంలో నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరు రఫీ మాట్లాడుతూ మైకావీధికి గాంధీరోడ్డు నుంచి 1934లో కొంతమంది దాతలు సర్వేనెంబర్.200లో ప్రజల సౌకర్యార్థం ధర్మసత్రం నిర్మించేందుకు స్థలాన్ని కేటాయిస్తూ, దారి సౌకర్యం కల్పించారన్నారు. దీనిని తమ దస్తావేజుల్లో పొందుపరచడమే కాకుండా హద్దులు నిర్ణయించారన్నారు. దీని ప్రకారం మైకావీధికి గాంధీరోడ్డు నుంచి 26 అడుగుల రోడ్డు ఉందన్నారు. ఈ దారిని స్థానికంగా ఉంటున్న మహబూబ్‌బాషా, అతని సోదరుడు అబ్దుల్‌బాషాలు రోడ్డుకు ఆనుకుని స్థలాన్ని కొనుగోలు చేసినట్లుగా పేర్కొంటూ ఆక్రమణ చేశారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకుని మైకా వీధికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసబాబు, మంజునాథ్, మహమ్మద్‌హుస్సేన్, షానవాజ్, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం


1098 ఆకారంలో కూర్చొని సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు

వాల్మీకిపురం: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ఆల్ పీపుల్ స్టూడెంట్ యూనిట్ ఫోర్స్ ఎన్జీఓ ఫౌండర్ ప్రణయ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానవుల అక్రమ రవాణా, బానిసత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కొంతమంది అమాయకులు, బాలికలు, బాలలకు మాయమాటలు చెప్పి వారిని అక్రమ రవాణాతో పాటు అక్రమ నిర్బంధం చేసి బానిసత్వంగా పని చేయిస్తున్నారన్నారు. ఇది చట్టరీత్యా నేరమని, వీరు శిక్షార్హులన్నారు. ఇలాంటి విషయాల్లో యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ తరహా సంఘటనలు తారసపడితే తక్షణమే 1098కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం 1098 ఆకారంలో విద్యార్థులు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి, అధ్యాపకులు నరసింహులు, ప్రసాద్, రవి, వెంకట్రమణ, శేఖర్, రమణ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ సందర్శన

బి.కొత్తకోట: ప్రెస్‌అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్ బుధవారం రాత్రి మండలంలోని హార్సిలీహిల్స్ విచ్చేశారు. రాత్రి గవర్నర్‌బంగ్లా అతిథిగృహంలో విడిది చేసిన ఆయన గురువారం ఉదయం ఇక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లారు.